క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారి పాదాల ప్రతిష్ఠ



వేంకటేశ్వరస్వామి పాదాలకు పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి పాదాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం కన్నులపండువగా జరిగింది. తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా శ్రీవారి పాదాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పాదాలను, స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి



గండేపల్లి పీహెచ్‌సీ వైద్యులకు మెమెంటో అందజేస్తున్న సీడీపీఓ, ఎంపీడీఓ

గండేపల్లి: బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ మిరియాల పూర్ణిమ, ఎంపీడీఓ నాతి బుజ్జి పిలుపునిచ్చారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బందికి కిశోర వికాసంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, పరిశుభ్రత, లైంగిక వేధింపులు, లింగ వివక్షత, సంపూర్ణ ఆహారం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యులు నరేష్, ఎంఈఓ కె.వెంకటరెడ్డి, చైల్డ్ లైన్ ఆఫీసర్ శ్రీనివాస్, వందన యూత్ వాలంటీర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

గండేపల్లి: జనవరి నెలకు సంబంధించిన పింఛన్లను ఒక్కరోజు ముందుగానే ఈ నెల 31 పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచనలు చేసినట్టు పేర్కొన్నారు.

ఏలేశ్వరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ఆధ్వర్యంలో శ్రీవిద్యా స్కూల్, షిర్డీ నగర్‌లోని గాం.దీజీ విగ్రహం తదితర ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు, తుప్పలను తొలగించారు. రహదారులకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సౌకర్యార్థం పారిశుధ్య పనులు నిర్వహించినట్టు కౌన్సిలర్ గోవిందు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు జువ్విన వీర్రాజు, లోగీసు శేఖర్, దత్తిరాజా తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెంలో రైతులకు శుక్రవారం మొక్కజొన్న సాగులో కలుపు నివారణపై అవగాహన కల్పించారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధనాసంస్థ, అఖిలభారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ పథకం విభాగం శాస్త్రవేత్తలు సుధీర్ కుమార్, సుజాత, నోడల్ ఆఫీసర్ రమేష్ కుమార్ రైతులకు కలుపు నివారణ, పురుగు మందుల వాడకంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ సద్గురుమూర్తి, ఆర్‌బీకే సిబ్బంది సాయికిరణ్, సుమిత్ర, రైతులు పాల్గొన్నారు.

హిందీ సాహిత్యంపై వెబినార్

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిందీ సాహిత్యంపై జాతీయస్థాయి వెబినార్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ తెలిపారు. సమకాలీన హిందీ సాహిత్యంపై సామాజిక స్పృహ అనే అంశంపై ఆన్‌లైన్‌లో వెబినార్ నిర్వహించామన్నారు. డాక్టర్ మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ హిందీ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్‌రావు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జె.విజయభారతి హిందీభాష ప్రాముఖ్యత, హిందీ సాహిత్యంపై చర్చించినట్టు తెలిపారు.

ఇర్రిపాక పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక పంచాయతీకి స్వచ్ఛ ట్రాక్టర్ మంజూరైంది. గ్రామంలోని చెత్త, వ్యర్థాలను తరలించడానికి వీలుగా స్వచ్ఛ భారత్ నిధులతో కొత్త ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. ఈ ట్రాక్టర్‌ను శుక్రవారం జగ్గంపేటలో టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి మౌలిక వసతులు ఎంతో ముఖ్యమని, ఈ ట్రాక్టర్‌తో ఇర్రిపాకలో చెత్త సేకరణకు వెసులుబాటు కలుగుతుందని నవీన్ అన్నారు. కార్యక్రమంలో జగ్గంపేట తహసీల్దార్ జేవీఆర్ రమేష్, స్థానిక నేతలు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, బుర్రి సత్తిబాబు, ఈవోపీఆర్డీ భాస్కరరావు, జేఈఉ నారాయణ పాల్గొన్నారు.



తుని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ శ్రేణులు



ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడిలో ముద్రగడ నివాసం నుంచి ప్రత్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బైక్ ర్యాలీగా వెళుతున్న నాయకులు, కార్యకర్తలు



జగ్గంపేటలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చార్జీలపై పోరు.. జనహోరు

- విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ పోరుబాట విజయవంతం
- అధికారులకు వినతి పత్రాల అందజేత
- తుని ఆందోళనలో పాల్గొన్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



తునిలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు

తుని: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన పోరుబాట కార్యక్రమం విజయవంతమైంది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన ఆందోళనకు ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణుల నుంచి అనూహ్య స్పందన లభించింది. తునిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. తొలుత స్థానిక శ్రీరామా సెంటర్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరామా సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. జీఎన్‌టీ రోడ్డు, గొల్ల అప్పారావు సెంటర్, మెయిన్ రోడ్డు, బాలాజీ సెంటర్, సూరవరం రోడ్డు, బ్యాంకుకాలనీ మీదుగా వీరవరపుపేట సబ్ స్టేషన్‌కు చేరుకున్నారు. సబ్ స్టేషన్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలపై భారం మోపమని చెప్పి ఒకేసారి సర్దుబాటు పేరుతో రూ. 15 వేల కోట్ల భారం వేశారని మాజీమంత్రి దాడిశెట్టి రాజా ఆరోపించారు. పెంచిన చార్జీలను తగ్గించాలని కోరుతూ ఏడీఈకు వినతిపత్రం సమర్పించారు. ఆరు నెలల్లో ప్రజలకు చేసింది ఏమీ లేదని సర్దుబాటు పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనను గమనిస్తున్నారని, ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందన్నారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. కార్యక్రమంలో తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, ఎంపీపీ లగుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, నాయకులు పోతల రమణ, నాగం గంగబాబు, దుంగల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్రగడ గిరిబాబు, పద్మనాభం ఆధ్వర్యంలో..

ప్రత్తిపాడు: ఎన్నికల సమయంలో కరెంట్ చార్జీలు తగ్గిస్తామని నమ్మబలికి...తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్తిపాడులో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. స్వగ్రామం కిర్లంపూడి నుంచి బైకులు, కార్లలో ర్యాలీగా వచ్చిన ముద్రగడ పార్టీశ్రేణులతో కలిసి పాదయాత్రగా ప్రత్తిపాడు విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈ ఎ.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ వినియోగదారులపై రూ.15.50 కోట్ల భారాన్ని మోపిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో రూ.వందల్లో వచ్చే కరెంట్ బిల్లులు ఇపుడు రూ.వేలల్లో వస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ బోర్లకు కరెంట్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీల పెంపును తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ఆరు నెలల్లోనే ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. ప్రభుత్వాన్ని నిలదీయకపోతే మళ్లీ ఆరుబయట మంచాలు వేసుకుని, విసనకర్రలతో విసురుకునే రోజులు దాపురిస్తాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై సమరానికి సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. అనంతరం ర్యాలీగా అంబేడ్కర్ కళామందిర్‌కు చేరుకుని, అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరి, గొల్లు చిన్న దివాణం, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, వాసిరెడ్డి జమీలు, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, సామంతుల సూర్యకుమార్, బదిరెడ్డి గోవిందు, కొరాడ ప్రసాద్, జల్లిగంపల ప్రభాకరరావు, సరమర్ల మధుబాబు, గౌతు స్వామి, రామిశెట్టి బులిరామకృష్ణ, చెక్కపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందిస్తున్న ముద్రగడ గిరిబాబు, నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

నియోజకవర్గంలో కార్యకర్తలకు ముద్రగడ కుటుంబం అండగా ఉంటుందని, ఆపై జననేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దన్నుగా ఉంటారని ముద్రగడ గిరిబాబు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మండపం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కొందరు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కార్యకర్తలపై దాడి చేస్తే ప్రతిదాడి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు.

పోరుబాటకు నడుం బిగించిన ముద్రగడ

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపింది. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఇచ్చిన పిలుపుతో ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం కిర్లంపూడిలోని వారి నివాసానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్తిపాడు సబ్‌స్టేషన్‌కు భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

కూటమి ప్రభుత్వంలో బాదుడే బాదుడు



జగ్గంపేటలో ఈపీడీసీఎల్ డీఈ వీరభద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న తోట నరసింహం, నాయకులు

జగ్గంపేట: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను బాదుడే బాదుడు అంటోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా జగ్గంపేటలో శుక్రవారం తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ ఆధ్వర్యంలో ర్యాలీ చేసి ఆందోళన నిర్వహించారు. గ్రామశివారు కోనేరు వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు, బస్టాండ్ మీదగా విద్యుత్ డీఈ కార్యాలయానికి చేరుకుంది. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఈపీడీసీఎల్ డీఈ వీరభద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల్లో గెలవడం కోసం తప్పుడు హామీలు ఇచ్చారని విమర్శించారు. విద్యుత్ బిల్లులు పెంచమని ప్రజలను నమ్మించి ఇప్పుడు రూ.వేల కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఫ్రీ కరెంట్ ఇస్తే ఇప్పుడు దానిని అమలు చేయటలేదని మండిపడ్డారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జగ్గంపేట, గోకవరం, కిర్లంపూడి, గండేపల్లి మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు రావుల గణేష్‌రాజా, పాటి రాంబాబు, పెనగంటి రాజేష్, మద్దిపట్ల రామకృష్ణ, పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, ఎస్సీ, సెల్ జోనల్ ఇన్‌చార్జి, లీగల్ సెల్ కన్వీనర్ గుల్ల ఏడుకొండలు, పార్టీ జగ్గంపేట పట్టణ అధ్యక్షులు కాపారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మనీటి సాగు పథకంతో లాభాలు



ములగపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సూక్ష్మనీటిసాగు అధికారి ప్రసాద్

రౌతులపూడి: సూక్ష్మనీటి సాగు పథకంతో రైతులకు మంచి లాభాలు చేకూరుతాయని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీవీ ప్రసాద్ అన్నారు. మండలంలోని ములగపూడిలో ఎస్సీ, ఎస్టీ రైతులకు శుక్రవారం మండల ఉద్యాన అధికారి పి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సూక్ష్మనీటి సాగు వినియోగం, ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్, మామిడి, జీడిమామిడి, జామ వంటి ఉద్యాన తోటల సాగుకు డ్రిప్ ఇరిగేషన్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బిందు, తుంపర సేద్యానికి ప్రభుత్వం అందించే రాయితీలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు పద్మలత, వీరేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సేవా కార్యక్రమాలు



వేమవరంలో రక్తదానం చేస్తున్న యువకులు

తొండంగి: మండలంలోని వేమవరానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జీకే గ్రూపు అధినేత కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఐ అండ్ వి బయో అర్జీమియా నాప్లీ సెంటర్‌లో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వేమవరం ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించారు. బెండపూడి శివారు శాంతివర్ధన ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగులు, తునిలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ నిర్వాహకుడు ఎస్.శ్రీనివాస్, తుని ఏరియా ఆస్పత్రి డైరెక్టర్ విజయ్, ఐ అండ్ వి సంస్థ మేనేజర్స్ శ్రీనిధి, లోకేష్, దొర, చందు, శ్రవణ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం



ప్రత్తిపాడు బార్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలోని శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జడ్జి భాను కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమ, సహనం, ఓర్పు నేటి సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, బార్ కార్యదర్శి బొంగుకూరి మధుబాబు, పాస్టర్లు జాకబ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి అనపరాజుపేటలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అతిథులు క్రీస్తు సందేశాన్ని అందించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

హరిదాసుకు సత్కారం



లింగంపర్తిలో హరిదాసును సన్మానిస్తున్న సుబ్బారావు, భక్తులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శుక్రవారం హరిదాసును ఘనంగా సన్మానించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సభ్యుడు ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో హరిదాసు నీలాల ప్రసాద్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మండల పరిధిలోని గ్రామాల్లో హరిదాసు ప్రసాద్ విశేష సేవలు అందిస్తున్నారన్నారు. హిందూ సంప్రదాయాలను కొనసాగిస్తున్న ప్రసాద్ సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉడతల రమణారావు, గవరసాని పెద్దకాపు, మాటూరి కృష్ణ, మంగయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రత్తిపాడు మండలం వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి బాబ్జి(32) తన వదిన మురుకుర్తి రాణితో కలిసి కత్తిపూడి గ్రామీణ బ్యాంక్‌కు వచ్చాడు. బ్యాంక్‌లో పని పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వెళ్లుతుండగా కత్తిపూడి జంగాల మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాబ్జి మృతి చెందాడు. తీవ్రగాయాలతో రాణి చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక దురాచారాలను రూపుమాపాలి



ప్రత్తిపాడు అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: సమాజంలో జరిగే సాంఘిక దురాచారాలను రూపు మాపడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పోక్సో చట్టంపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్ బాబు మాట్లాడుతూ చిన్నారులకు గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలని కోరారు. కిశోర బాలికలకు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పద్ధతులను వివరించాలని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 9 గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హోమం ప్రారంభించి, 11.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు దంపతులతో పాటు 50 మంది భక్తులు రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొన్నారు. ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, రత్నగిరి తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



చిన్నింపేటలో జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేటలో జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల నిర్వహిస్తున్న ఆందోళనలు శుక్రవారం కొనసాగాయి. దీక్షాశిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మూసివేసిన ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని వేములపాలెంలో సారా స్థావరాలపై ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటపు ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు



కిర్లంపూడిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ పద్మనాభం



జగ్గంపేటలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోట నరసింహం

- మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మృతికి సంతాపం
- ఆయన సేవలను కొనియాడిన నేతలు

జగ్గంపేట: మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శుక్రవారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అప్పట్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసిన గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు రామకుర్తి జగాల్, మూర్తి, భూమాడ గణపతి, తులా రాము, పెద్దాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు/కిర్లంపూడి: ప్రఖ్యాత ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆకాల మరణానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గిరిబాబు సంతాపం తెలిపారు. కిర్లంపూడిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. దేశానికి మన్మోహన్ సింగ్ ఎనలేని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.